సాక్షి
నిజామాబాద్
శుక్రవారం । 16 । ఆగస్టు । 2024



శుభకరం.. వరలక్ష్మివ్రతం

సౌభాగ్యాన్ని, సకల సంపదలను ఇచ్చే వరలక్ష్మివత్రాన్ని మహిళలు నేడు భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు.

- 10లో ▸



పోలీసులకు పతకాలు..

ఉత్తమ సేవలందించిన జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది స్వాతంత్ర్య వేడుకల్లో సేవాపతకాలు అందుకున్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.5 /25.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి.

రైతన్నకు ఆర్థిక స్వాతంత్ర్యం



ఈరవత్రి అనిల్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, సిబ్బంది

- జిల్లాలో 70,084 మందికి రూ.452.12 కోట్ల పంట రుణాలమాఫీ
- త్వరలో నిజాం షుగర్స్‌కు పూర్వవైభవం
- ప్రజాసమస్యల పరిష్కారంలో ముందున్నాం
- స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్



జాతీయ పతాకానికి వందనం చేస్తున్న ఈరవత్రి అనిల్, ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యేలు, మేయర్, కలెక్టర్, సీపీ



నిజామాబాద్‌అర్బన్: దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన కాంగ్రెస్సే నేడు రైతులకు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని తీసుకువచ్చిందని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ అన్నారు. మూడు రంగుల జెండా ఎగురవేసే అవకాశం తనకు రావడం అదృష్టంగా, గర్వంగా భావిస్తున్నానని అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో గురువారం నిర్వహించిన 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయన జిల్లా ప్రజలనుద్దేశించి ప్రసంగించారు..

సాహసోపేత నిర్ణయం

రైతన్నలకు ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేయాలని సాహసోపేత నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం హామీని నిలబెట్టుకుంది. జిల్లాలోని అంకాపూర్ రైతులతోపాటు జిల్లాలో సాగయ్యే పసుపునకు దేశస్థాయిలో మంచి గుర్తింపు ఉంది. జిల్లాలో మొత్తం 70,084 మంది రైతన్నలకు రూ.452.12 కోట్ల రుణమాఫీ అయ్యింది.

నిజాంషుగర్స్ తెరుచుకుంటుంది

త్వరలోనే నిజాంషుగర్స్‌కు పూర్వవైభవం వస్తుంది. ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తరువాత మంత్రి శ్రీధర్‌బాబు సారథ్యంలో కేబినెట్ కమిటీ వేయగా ఫ్యాక్టరీని సందర్శించారు. ఫ్యాక్టరీని తిరిగి తెరిపించడంలో ఉన్న ఇబ్బందులను అధ్యయనం చేశారు. బ్యాంకు బకాయిల వన్‌టైం సెటిల్మెంట్ కోసం రూ.40 కోట్లకుపైగా నిధులు విడుదల చేశారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో నిజాంషుగర్స్‌ను తెరిపిస్తామని చెప్పి ఆ తరువాత ఫ్యాక్టరీని తెరిచేది లేదని గత ప్రభుత్వం ప్రకటించడం నన్ను కలిచివేసింది. ఫ్యాక్టరీ తెరుచుకుంటుందని వెయ్యి కళ్లతో ఎదురు చూశా.



గల్ఫ్‌బోర్డు

ప్రజాప్రభుత్వంలో గల్ఫ్ కార్మికుల సమస్యలకు మంచి పరిష్కారం లభిస్తుందనే నమ్మకం ఉంది. గల్ఫ్‌పాలసీ, గల్ఫ్‌బోర్డు ఏర్పాటు ద్వారా సమస్యకు పరిష్కారం దొరుకుతుందని ఆశిస్తున్నా. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజాసమస్యల పరిష్కారంలో ముందుంది.

ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి, గృహజ్యోతి

ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేర్చనుంది. ఒక్క సంవత్సరంలో 4 లక్షల 50 వేల ఇళ్ల నిర్మాణాన్ని తలపెట్టింది. ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్లను నిర్మించనుంది. మహాలక్ష్మి పథకం ద్వారా కేవలం రూ.500 వంటగ్యాస్‌ను అందజేస్తోంది. ఈ పథకం ద్వారా జిల్లాలో 2,25,992 కుటుంబాలకు లబ్ధి చేకూరుతోంది. ఇప్పటివరకూ 2,25,992 మంది వినియోగదారులకు 4,46,131 గ్యాస్ సిలిండర్ల పంపిణీ పూర్తయ్యింది. దీనికి గాను ప్రభుత్వం రూ.13.47 కోట్ల సబ్సిడీ అందించింది. గృహజ్యోతి ద్వారా 200 యూనిట్లలోపు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్‌ను సరఫరా చేస్తోంది. జిల్లాలో ఇప్పటివరకు 13,84,046 జీరో బిల్లులు జారీ అయ్యాయి. మొత్తం 13,84,046 కుటుంబాలకు ఈ పథకం ద్వారా లబ్ధిచేకూరుతోంది. ఇప్పటివరకు ప్రభుత్వం రూ.53.03 కోట్ల సబ్సిడీ అందజేసింది.

ఒక్కొక్కటిగా హామీల అమలు

అధికారంలోకి వచ్చిన 48గంటల నుంచే ప్రభుత్వం అభయహస్తం హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నది. ఆడపడుచులు, ట్రాన్స్‌జెండర్లకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని అమలు చేస్తోంది. మహిళలు పైసా ఖర్చు లేకుండా రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణిస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 3.82 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు సౌకర్యాన్ని వినియోగించుకున్నారు. దీని ద్వారా మహిళలకు రూ.143.56 కోట్ల లబ్ధి చేకూరింది. రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య పరిమితి రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెరిగింది. జిల్లాలో 21,534 మంది పేదలు చికిత్స పొందగలిగారు.



పోలీసుల గౌరవవందనాన్ని స్వీకరిస్తున్న రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్



టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ (కంజర) విద్యార్థినుల నృత్య ప్రదర్శన



నృత్యం చేస్తున్న కేజీబీవీ (నందిపేట) విద్యార్థులు,



ఛత్రపతి వేషధారణలో వసుధ స్కూల్ విద్యార్థి

న్యూస్‌రీల్

ఢిల్లీ వేడుకల్లో ఎల్లారెడ్డిపల్లె రైతు



ఇందల్వాయి: ఢిల్లీలోని ఎర్రకోట వద్ద నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో మండలంలోని ఎల్లారెడ్డిపల్లెకు చెందిన రైతు శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ యోజన పథకం ద్వారా ఎంపికైన శ్రీనివాస్ తన భార్యతో కలిసి ఢిల్లీకి వెళ్లారు. తెలంగాణలోని ఐదు జిల్లాల నుంచి ఒక్కో రైతు ఢిల్లీలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు ఎంపికయ్యా రు. జిల్లాకు ఒక రైతు చొప్పున ఎంపికయ్యా రు. ప్రధానమంత్రి కిసాన్ సామ్మాన్ యోజ న పథకం నోడల్ అధికారి జాన్సన్ ఆధ్వర్యంలో వీరు ఢిల్లీకి వెళ్లగా.. ప్రయాణ, హో టల్ ఖర్చులను ప్రభుత్వమే భరించింది. రాష్ట్రాల వారీగా నిర్వహించిన సమావేశాల్లో పీఎం కిసాన్ సామ్మాన్ యోజన పథకంపై రెండు నిమిషాలపాటు ప్రసంగించే అవకా శం సక్కి శ్రీనివాస్‌కు దక్కింది. తన ప్రసంగంలో పీఎం కిసాన్ సమ్మాన్ యోజన ప థకం ద్వారా లాభాలు, అర్హులైన రైతులకు పథకం పూర్తిస్థాయిలో అందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై మాట్లాడినట్లు శ్రీనివాస్ తెలిపారు.

ఉత్తమ అధికారులకు మెమొంటోలు ప్రదానం



సుభాష్‌నగర్: జిల్లాలోని విద్యుత్‌శాఖలో ఉత్తమ అధికారులుగా ఎంపికైన అధికారులకు వరంగల్‌లోని టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సీఎండీ వరుణ్‌రెడ్డి గురువారం మెమొంటోలు ప్రదానం చేశారు. సుహాసినీ (ఏడీఈ ఆపరేషన్ నవీపేట్), శ్రీధర్ (ఏడీఈ ఆపరేషన్, ఆర్మూర్), నాయిని కృష్ణ, గంగాశేఖర్, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, గంగారాం, సత్యప్రసాద్(ఏఈలు), సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్‌తోపా టు గతే డాది అత్యధిక వ్యవసాయ కనెక్ష న్లు అందజేసిన ఏడీఈ శ్రీనివాస్(డిచ్‌పల్లి)కి మెమెంటోలు, జ్ఞాపికలు అందజేశారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బాల్కొండ: ఎగువ ప్రాంతాల నుంచి శ్రీరాం సాగర్ ప్రాజెక్టులోకి 4303 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. కాకతీయ కాలువ ద్వారా 3 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 500, లక్ష్మికాలువ ద్వారా 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 522 క్యూసెక్కుల నీరుపోతోంది. మిషన్ భగీరథకు 231 క్యూ సెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో సమానంగా ఉండటంతో ప్రాజెక్ట్ నీటి మట్టం నిలకడగా ఉంది. పూర్తిస్థాయి నీటిమట్టం 1091 (80టీఎంసీలు) అడుగులు కాగా గురువారం సాయంత్రానికి 1081.10 (48.07టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది.

ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు



హరిదాసు వేషధారణలో ప్రదర్శన ఇస్తున్న నందిపేట కేజీబీవీ విద్యార్థులు

- రెపరెపలాడిన త్రివర్ణపతాకం
- ఆకట్టుకున్న చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు.. ఆయా శాఖల శకటాలు, స్టాళ్లు

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని పోలీస్ పరే డ్ గ్రౌండ్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ ఈరవత్రి హాజరై జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అంతకుముందు పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించిన అనిల్.. పురప్రముఖులు, అధికారులు, వేడుకలకు హాజరైన వారిని కలిసి స్వాతంత్ర్య దినోత్సవ శుభా కాంక్షలు తెలిపారు. ఆయా శాఖల ప్రగతి కళ్లకు కట్టేలా ప్రదర్శించిన శకటాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. వివిధ పథకాల ద్వారా మంజూరు చేసిన ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేశారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. మోపాల్, నందిపేట్ కస్తూర్బా పాఠశాలల బాలికలతోపాటు నవీపేట్ జెడ్పీ హై స్కూల్ విద్యార్థులు దేశభక్తి గీతాలపై ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా చిన్నారులను ముఖ్య అతిథి అనిల్, జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించి బహుమతులు ప్రదానం చేశారు. వేడుకల్లో ఎంపీ ధర్మ పురి అర్వింద్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, ఆర్.భూపతిరెడ్డి, పైడి రాకేశ్‌రెడ్డి, నగర మే యర్ నీతూకిరణ్, డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, రాష్ట్ర సహకార ఫెడరేషన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, జిల్లా జడ్జి కె.సునీత, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్, ట్రెయినీ కలెక్టర్ సంకేత్, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్ ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, స్వాతంత్ర్య సమరయోధులు తదితరులు పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాల్సిందే !

- సింహాచలం వేధింపులపై మంత్రి తుమ్మలకు సొసైటీ చైర్మన్ల ఫిర్యాదులు
- ఇష్టారీతిన డబ్బుల వసూళ్లు..
- నష్టాల బాటలో ఉమ్మడి జిల్లాలోని 30 సొసైటీలు
- సొంత రాష్ట్రానికి వెళ్లకుండా కేంద్ర మంత్రితో లాబీయింగ్
- తద్వారా ఏపీ సీఎం చంద్రబాబుతో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి చెప్పించుకునేలా పావులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: సస్పెన్షన్‌కు గురైన మాజీ డీసీవో సింహాచలం ఒక అధికారి తరహా వ్యవహరించకుండా మాఫియాడాన్ లాగా బెదిరించడంతో పాటు భయభ్రాంతులకు గురిచేసినట్లు పలువురు సహకార సంఘాల చైర్మన్లు, సీఈవోలు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు గత ఎనిమిది నెలలుగా వరుసగా ఫిర్యాదులు చేశారు. ఏమీ లేకున్నప్పటికీ కావాలని ఆరోపణలు చేయడం, వ్యక్తిగతంగా ఇబ్బందులు పెట్టినట్లు ఆధారాలతో సహా వీరంతా తమ ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. సింహాచలం సస్పెండ్ అయిన నేపథ్యంలో పలువురు సహకార సంఘాల చైర్మన్లు, సీఈవోలు 'సాక్షి'కి ఫోన్ చేసి తాము ఎదుర్కొన్న ఇబ్బందులను తెలిపారు.

సస్పెండ్ అయిన సింహాచలం సొంత రాష్ట్రానికి వెళ్లడానికి బదులు, ఢిల్లీ వెళ్లి తన సొంత జిల్లాకు చెందిన కేంద్ర మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడును కలిసి లాబీయింగ్ చేస్తుండడం గమనార్హం. రామ్మోహన్‌నాయుడు ద్వారా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చెప్పించుకుంటానని సింహాచలం చెబుతుండడం గమనార్హం. ఈ నేపథ్యంలో బాధిత సొసైటీల చైర్మన్లు, సీఈవోలు సింహాచలంను సర్వీసు నుంచి తొలగించాలని డిమాండ్లు చేస్తున్నారు. ఈ మేరకు మంత్రి తుమ్మలకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో 30 సొసైటీలు నష్టాల్లోకి వెళ్లాయి. ఇంతగా విధ్వంసం చేసిన సింహాచలం విషయంలో ఉపేక్షించవద్దని వీరంతా కోరుతున్నారు.

అవిశ్వాస సమావేశానికి హాజరుకాకుండా..

కామారెడ్డి జిల్లా రాజంపేట సహకార సంఘం చైర్మన్ నల్లవెల్లి అశోక్‌కు వ్యతిరేకంగా 2023 డిసెంబర్ 8న అవిశ్వాసం కోసం కొందరు డైరెక్టర్లు అప్పటి డీసీవో సింహాచలంకు లేఖ ఇచ్చారు. దీంతో సింహాచలం 2024 జనవరి 2న అవిశ్వాస సమావేశం ఏర్పాటు చేస్తూ గత డిసెంబర్ 11న నోటీసులు ఇచ్చాడు. అయితే డీసీవోగా ఉన్న సింహాచలం జనవరి 2న సదరు సమావేశానికి రాలేదు. ఈ విషయమై చైర్మన్ అశోక్ డీసీవో ఆఫీస్ సూపరింటెండెంట్ భూమయ్యకు ఫోన్ చేయగా డీసీవో నిజామాబాద్ నుంచి ఉదయం 11.30 గంటలకు వస్తున్నట్లు చెప్పారు. అయినప్పటికీ రాకపోవడంతో సింహాచలంకు ఫోన్ చేయగా.. తనకు వాయిదా వేసే అధికారం ఉందని, మరుసటి రోజైన జనవరి 3 వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు తెలిపాడు.

ఈ విషయాన్ని ముందుగానే చెప్పలేదని అశోక్ అడుగగా, అసభ్యకరంగా మాట్లాడడంతో పాటు ఇష్టం వచ్చినప్పుడు వస్తానని, సమాధానం చెప్పాల్సిన అవసరం లేదని అనడంతో పాటు భయభ్రాంతులకు గురిచేసినట్లు అశోక్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. చివరకు 2024 జనవరి 3న పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. సదరు అవిశ్వాస సమావేశానికి సైతం సింహాచలం హాజరు కాకుండా సూపరింటెండెంట్‌ను పంపాడు.

ధాన్యం కేంద్రాల ఫ్లెక్సీల విషయంలోనూ..

ఉమ్మడి జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఫ్లెక్సీల ఏర్పాటు కోసం కొన్ని చోట్ల రూ.2 వేల చొప్పున, మరికొన్ని చోట్ల రూ.3 వేల చొప్పున వసూలు చేయడం గమనార్హం. 714 ధాన్యం కొనుగోలు కేంద్రాలుండగా, ఒక్కో ఫ్లెక్సీకి రూ.600 ఖర్చుకు గాను రూ.2వేల నుంచి రూ.3వేలను సింహాచలం వసూలు చేసినట్లు ఫిర్యాదులు చేశారు. ధాన్యంపై కమీషన్ డబ్బుల విషయంలోనూ పీఏసీఎస్‌లకు చెక్కులు ఇచ్చినందుకు రెండు శాతం కమీషన్ తీసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పైగా సంఘాలకు ఇవ్వాల్సిన కమీషన్ డబ్బులను సింహాచలం తన సొంత అవస రాలకు వాడుకోవడం గమనార్హం. అధికారాన్ని పూర్తిగా దుర్వినియోగం చేసి సంఘాల చైర్మన్లను, సీఈవోలను ఇబ్బందులకు గురిచేసిన సింహాచలంపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నట్లు ఫిర్యాదుల్లో పేర్కొన్నారు.

రుణం చెల్లించినప్పటికీ నోటీసులు..

రాజంపేట సొసైటీ చైర్మన్ అశోక్ తన తల్లి పేరిట ఉన్న రూ.56 వేల లాంగ్‌టర్మ్ రుణానికి నగదును వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద 2024 జనవరి 3న సొసైటీ సీఈవోకి చెల్లించారు. దీని గురించి రశీదు బుక్‌లోనూ రాశారు.

2024 జనవరి 4న సీఈవో బ్యాంక్ ఖాతాలో జమ చేశాడు. ఇందుకు సంబంధించి రశీదు సైతం ఉంది. అయితే పీఏసీఎస్ రశీదు బుక్‌లో ఎర్ర రశీదు (రశీదు బుక్) మాత్రం సదరు అశోక్ తల్లికి ఇవ్వకుండా సింహాచలం సొసైటీ సీఈవోను సస్పెండ్ చేస్తానని బెదిరించాడు. పైగా సదరు రశీదును రద్దు చేయాలని సింహాచలం చెప్పడం గమనార్హం. జనవరి 4న అశోక్ ఇంట్లో లేని రాత్రి సమయంలో నోటీసులు అంటించారు. సదరు రుణానికి గ్యారంటీగా ఉన్నందున అనర్హత వేటు వేస్తానని నోటీసుల్లో చైర్మన్ అశోక్‌ను బెదిరించడం విశేషం. రుణం పూర్తిగా చెల్లించిన తరువాత సైతం ఇలా వ్యవహరించడం పట్ల అశోక్ హైకోర్టుకు వెళ్లి సదరు నోటీసులను రద్దు చేయించుకున్నారు. ఇదేరీతిలో పలువురు చైర్మన్లు, సీఈవోల పరువు ప్రతిష్టలకు భంగం కలిగించేలా సింహాచలం వ్యవహరించడం పై మంత్రికి ఫిర్యాదులు వెళ్లాయి.

ముచ్చటగా మూడో విడత

- జిల్లాలో 15,724 మంది రైతులకు లబ్ధి
- నేడో, రేపో ఖాతాల్లో జమకానున్న రుణమాఫీ డబ్బులు



డొంకేశ్వర్(ఆర్మూర్): రైతు రుణ మాఫీ ప్రక్రియలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ముచ్చగా మూడో విడతను దాదాపు పూర్తి చేసింది! రూ.2లక్షల వరకు పంట రుణాలు పొందిన అర్హులైన రైతులను గుర్తించింది. జిల్లాలో 11,411 రైతు కుటుంబాలకు గాను 15,724 లోన్ ఖాతాలు రుణమాఫీకి అర్హత పొందగా రూ.190.33కోట్లు ప్రభుత్వం మాఫీ చేయనుంది. ఈ వివరాలను ప్రభుత్వం గురువారం విడుదల చేసింది. అయితే, మండలాలు, గ్రామాల వారీగా రైతుల పేర్లు వ్యవసాయ శాఖకు ఇంకా అందలేదు. దీంతో రూ.2లక్షల వరకు రుణం ఉన్న రైతులు లిస్టులో తమ పేర్లున్నాయో లేదోనని తెలుసుకోవడానికి వ్యవసాయాధికారులకు ఫోన్లు చేస్తున్నారు. రెండు మూడురోజుల్లో మాఫీకి సంబంధించిన సొమ్ము రైతుల లోన్ ఖాతాల్లో జమయ్యే అవకాశాలున్నాయి.

ఏవోలకు బాధ్యతలు

ప్రభుత్వం ఇప్పటి వరకు రెండు విడతల్లో రైతు రుణమాఫీ చేసింది. మొదటి విడతలో జిల్లాలో 44,469 మంది రైతులకు రూ.225.62 కోట్లు, రెండో విడతలో 22,868 మందికి రూ.210.54 కోట్లు మాఫీ చేసింది. మొదటి రెండు విడతల్లో కొంతమంది రైతులకు పలు కారణాల వల్ల రుణమాఫీ వర్తించలేదు. ఆధార్ కార్డుకు లోన్ ఖాతాకు పేరులో తేడా ఉండడం, జాబితాలో ఇతర రైతుల పేర్లు రావడం, రేషన్ కార్డు లేక కుటుంబ నిర్ధారణ కాకపోవడం, అలాగే సొసైటీలు, బ్యాంకుల్లో జరిగిన తప్పులతో 2వేల మందికిపైగా రైతులు రుణమాఫీకి దూరంగా ఉన్నారు. వ్యవసాయ శాఖకే దాదాపు 1,400 ఫిర్యాదులు అందాయి. ఇటువంటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తప్పులను సరిదిద్ది కుటుంబ నిర్ధారణ చేసే బాధ్యతలను మండల వ్యవసాయాధికారులకు అప్పగించింది. వారు రైతు ఇంటికి వెళ్లి వివరాలు సేకరించి ప్రభుత్వం సూచించిన పోర్టల్‌లో సరైన డేటాను నమోదు చేయాలి. ఏవోలు పంపిన డేటా ఆధారంగా మాఫీ వర్తించని రైతులకు ప్రభుత్వం త్వరలో రుణమాఫీ చేయనుంది.

క్లుప్తంగా

స్టాళ్లను పరిశీలించిన కలెక్టర్



నిజామాబాద్‌అర్బన్‌: జిల్లా కేంద్రంలోని పోలీస్‌ పరేడ్‌ గ్రౌండ్‌లో గురువారం నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన పలు స్టాళ్లను కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు, అడిషనల్‌ కలెక్టర్‌ అంకితఖ్‌ పరిశీలించారు. స్టాళ్ల నిర్వాహకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వారి వెంట అధికారులు, సిబ్బంది ఉన్నారు.



మహనీయుల త్యాగాలు మరువలేనివి



ఖలీల్‌వాడి: స్వాతంత్ర్య కోసం మహనీయులు చేసిన పోరాటాలు, త్యాగం మరువలేనివని తెలంగాణ సహకార యూనియన్‌ లిమిటెడ్‌ చైర్మన్‌, జిల్లా కాంగ్రెస్‌ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా కాంగ్రెస్‌ భవన్‌లో జాతీయ జెండాను గురువారం ఎగురవేశారు. అలాగే గాంధీ చౌక్‌ వద్ద నగర కాంగ్రెస్‌ కమిటీ అధ్యక్షుడు కేశ వేణు జెండాను ఎగుర వేశారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశంలో బీజేపీ మతాల పేరుతో రెచ్చగొడుతూ ప్రజల మధ్య చిచ్చులు పెడుతోందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు కేశవేణు, నాయకులు భక్తవత్సలం, ముప్ప గంగారెడ్డి, శేఖర్‌ గౌడ్‌, మీసాల సుధాకర్‌ రావు, సంతోష్‌, నరేందర్‌ గౌడ్‌, బొబ్బిలి రామకృష్ణ, కేశ మహేశ్‌, ఈసా, జగదం సుమన్‌, మటం రేవతి, పోల ఉష, చంద్రకళ, గాజుల సుజాత, శరత్‌ కుమార్‌, దత్తు, ప్రమోద్‌, గౌతం, కేశ రాజు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో డీఈపై చర్యలు తీసుకోవాలి



ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ ట్రాన్స్‌కో డీఈ హరిచంద్‌ అక్రమాలకు పాల్పడుతున్నాడని లైన్‌మన్‌ వీర్‌కుమార్‌ ఆరోపించారు. ఆర్మూర్‌ డివిజన్‌ కార్యాలయం ఆవరణలో గురువారం లైన్‌మన్‌ వీర్‌కుమార్‌ మాట్లాడారు. విద్యుత్‌ కార్మికులకు అనవసరంగా సస్పెండ్‌ చేస్తున్నారని, మెమోలు ఇస్తూ డబ్బులు అడుగుతున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డీఈని సస్పెండ్‌ చేయాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తానని అన్నారు. ఈవిషయమై డీఈ హరిచంద్‌ను వివరణ కోరగా లైన్‌మన్‌ చేస్తున్న ఆరోపణలు అవాస్తమన్నారు. ఆర్మూర్‌ డివిజన్‌ పరిధిలో పోస్టింగ్‌ కోరిన చోట ఖాళీ లేకపోవడంతో విద్యుత్‌ శాఖ నిబంధనల ప్రకారం ఎక్కడ పోస్టింగ్‌ ఇవ్వాలో అక్కడే ఇచ్చామన్నారు.

ఉత్తమ సేవలకు ప్రశంసలు

ప్రభుత్వ శాఖల్లో జిల్లా స్థాయిలో ఉత్తమ సేవలు అందించిన అధికారులకు, ఉద్యోగులకు, సిబ్బందికి రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్‌ ఈరవత్రి అనిల్‌ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రశంసాపత్రాలు అందించారు. ఏడాది కాలంలో వారు అందించిన సేవలను ప్రశంసిస్తూ జిల్లా కేంద్రంలోని పోలీస్‌ పరేడ్‌ గ్రౌండ్‌లో గురువారం నిర్వహించిన వేడుకల్లో ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. విధి నిర్వహణలో వారు ప్రదర్శించిన తీరుపై అభినందనలు తెలిపారు. ప్రజల మన్ననలు పొందిన వారే గుర్తింపు పొందుతారని అన్నారు. కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్‌, ఆయా శాఖల అధికారులు ఉన్నారు. -సాక్షి, నెట్‌వర్క్‌



రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్‌ ఈరవత్రి అనిల్‌ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న అదనపు కలెక్టర్‌ అంకిత్‌



మకరంద్‌, మున్సిపల్‌ కమిషనర్‌ | కిరణ్‌కుమార్‌, అడిషనల్‌ కలెక్టర్‌ | పాపారావు, డిప్యూటీ రిజిస్ట్రార్‌ కోఆపరేటివ్‌ | రాజేందర్‌, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్‌ | శంకర్‌, పీఆర్‌ ఇంజినీర్‌ | సురేష్‌, జిల్లా ఆర్‌అండ్‌బీ అధికారి | రమేశ్‌, ఎస్‌ఈ కార్పొరేషన్‌ ఈడీ | రాజేంద్రకుమార్‌, ఆర్డీవో నిజామాబాద్‌ | రాజాగౌడ్‌, ఆర్డీవో ఆర్మూర్‌ | రాజేశ్వర్‌, ఆర్డీవో బోధన్‌ | ప్రశాంత్‌కుమార్‌, కలెక్టరేట్‌ ఏవో | విజేందర్‌రెడ్డి, సూపరింటెండెంట్‌ | శ్రీనివాస్‌రావు, సూపరింటెండెంట్‌ | పవన్‌కుమార్‌, సూపరింటెండెంట్‌



గంగాధర్‌గౌడ్‌, రానాకలాన్‌ లైన్‌మన్‌ | కార్తీక్‌, ఈ-డిస్ట్రిక్‌ మేనేజర్‌ | నవీన్‌కుమార్‌, డిప్యూటీ తహసీల్దార్‌ | గోపాల్‌, కలెక్టరేట్‌ హెచ్‌హెచ్‌పీ | జమీర్‌, కలెక్టరేట్‌ హెచ్‌హెచ్‌పీ | సతీశ్‌, కలెక్టర్‌ గన్‌మెన్‌ | నాగార్జున, నార్త్‌ తహసీల్దార్‌ | అశ్వక్‌అహ్మద్‌, డిప్యూటీ తహసీల్దార్‌ | గంగాధర్‌, తహసీల్దార్‌ కోటగిరి | మమత, వర్ని డిప్యూటీ తహసీల్దార్‌ | ఆంజనేయులు, తహసీల్దార్‌ కమ్మర్‌పల్లి | సత్యనారాయణ, తహసీల్దార్‌, మోర్తాడ్‌ | శ్రీకాంత్‌, ముప్కాల్‌ డిప్యూటీ తహసీల్దార్‌ | రంజిత్‌, ఐటీ అసిస్టెంట్‌, జిల్లా పంచాయతీ



సుమన్‌, లీడింగ్‌ ఫైర్‌మన్‌ | శ్రీనివాస్‌, ఫైర్‌మన్‌ | ప్రశాంత్‌, హోమ్‌గార్డ్‌, డ్రైవింగ్‌ ఆపరేటర్‌ | రాజీవ్‌, చీఫ్‌ ప్లానింగ్‌ ధర్పల్లి | పద్మ, ఉమెన్స్‌ కోఆపరేటివ్‌ జిల్లా మేనేజర్‌ | గంగాధర్‌, రెడ్‌కో జిల్లా మేనేజర్‌ | మాధురి, అసిస్టెంట్‌ ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీర్‌ | రవీందర్‌, ఫారెస్ట్‌ ఆఫీసర్‌ కమ్మర్‌పల్లి



అంజయ్య, ఆర్టీసీ పీఆర్వో



అవార్డు అందుకుంటున్న ఎక్సైజ్‌ ఉద్యోగులు



అవార్డు అందుకుంటున్న ట్రాన్స్‌కో ఉద్యోగులు



7వ బెటాలియన్‌ ఆర్‌ఎస్సై, పీసీ, హోంగార్డులు



ఎక్సైజ్‌ ఉద్యోగులు



డీఎంహెచ్‌వో ఉద్యోగులు



జిల్లా రూరల్‌ డెవలప్‌మెంట్‌ ఉద్యోగులు



ప్రశంసాపత్రం అందుకుంటున్న జిల్లా పశుసంవర్ధకశాఖ ఉద్యోగులు



ఇందూరు జిల్లా మహిళా సమాఖ్యకు బ్యాంకు రుణాలు, స్త్రీనిధి రుణాల చెక్కులను అందజేస్తున్న ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్‌ ఈరవత్రి అనిల్‌, రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు, మేయర్‌ నీతూకిరణ్‌, అధికారులు



పోలీసులకు సేవా పతకాలు

పోలీస్‌శాఖలో జిల్లా స్థాయిలో ఉత్తమ సేవలు అందించిన పోలీసులు అధికారులు, సిబ్బందికి రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్‌ ఈరవత్రి అనిల్‌ ప్రశంసాపత్రాలు అందించారు. కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్‌ ఉన్నారు. -సాక్షి, నెట్‌వర్క్‌



సేవా పతకం అందుకుంటున్న ట్రాఫిక్‌ ఏసీపీ నారాయణ



శ్రీశైలం, ఎస్‌బీ సీఐ | శ్రీలత, పీఎస్‌ సీఐ | అంజమ్మ, ఎస్సై | అంజయ్య, ఏఆర్‌ఎస్సై | రాజు, ఎస్సై | లక్ష్మణ్‌, ట్రాఫిక్‌ హెడ్‌కానిస్టేబుల్‌ | నాగయ్య, ఏసీపీ హెడ్‌క్వార్టర్‌ | అనిల్‌కుమార్‌, ట్రాఫిక్‌ ఏఎస్సై



పౌరసరఫరాల శాఖ శకటం



విద్యుత్‌శాఖ శకటం



జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ..



వ్యవసాయ శాఖ..

ఆకట్టుకున్న శకటాలు

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రదర్శించిన శకటాలు ఆకట్టుకున్నాయి. వైద్య, ఆరోగ్య, ఆర్టీసీ, వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధి, పలు శాఖల ద్వారా అందిస్తున్న సేవలను అధికారులు శకటాల ద్వారా ప్రదర్శనలు చేపట్టారు. -సాక్షి, నెట్‌వర్క్‌



జిల్లా వైద్యారోగ్యశాఖ..



జిల్లా పంచాయతీ విభాగం..



ఆర్టీసీ మహాలక్ష్మీ బస్సు..

ఇద్దరిపై దాడి

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని రెండో టౌన్‌ పీఎస్‌ పరిధిలోని ఎంఐఎం కార్యాలయం ఎదుట ఇద్దరిపై కొందరు గురువారం దాడి చేశారు. రెండో టౌన్‌ పరిధికి చెందిన ఎండీ జునేద్‌, ఎండీ అల్మాస్‌ఖాన్‌ బైక్‌పై ఎంఐఎం కార్యాలయ సమీపంలో వెళ్తుండగా అదే ప్రాంతానికి చెందిన సమీర్‌, అజార్‌, ఉమర్‌, కొంత మంది కలిసి దాడి చేశారన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యాసిన్‌ అరాఫత్‌ పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై..

ఇందల్వాయి: మండలంలోని తిర్మన్‌పల్లి శివారులో పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై మనోజ్‌ తెలిపారు. నలుగురిని అరెస్టు చేసి రూ.18,400 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మోపాల్‌ డీటీ జగదీశ్వరి సరెండర్‌

మోపాల్‌: మోపాల్‌ తహసీల్‌ కార్యాలయ డిప్యూటీ తహసీల్దార్‌ జగదీశ్వరిని సరెండర్‌ చేసిన ఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయమై తహసీల్దార్‌ రామేశ్వర్‌ను వివరణ కోరగా డీటీ జగదీశ్వరి చైల్డ్‌ కేర్‌ నిమిత్తం ఈనెల 6 నుంచి దీర్ఘకాలిక సెలవులో వెళ్లిందని, కార్యాలయంలో పనిభారంతో ఆమెను సరెండర్‌ చేస్తూ కలెక్టర్‌, ఆర్డీవోకు లేఖ రాసిన విషయం వాస్తవమేనన్నారు. డీటీగా మరొకరిని కేటాయించాలని వారిని కోరినట్లు తెలిపారు.

క్రైం కార్నర్‌

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి



రుద్రూర్‌: మండలంలోని రాయకూర్‌ చెరువులో చేపల వేటకు వెళ్లిన ఎర్రోల్ల నారాయణ(38) అనే యువకుడు ప్రమాదవశాత్తు వలలో చిక్కుకుని మృతి చెందినట్లు ఏఎస్సై రాజు పేర్కొన్నారు. బుధవారం రాత్రి చేపల కోసం ఇంటి నుంచి వెళ్లిన నారాయణ తిరిగి రాలేదు. కుటుంబీకులు గురువారం చెరువులో వెతుకగా మృతదేహం లభించింది. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరు..

రుద్రూర్‌: మండలంలోని అంబం(ఆర్‌) గ్రామానికి చెందిన కౌలడి నర్సయ్య(76) అనే వృద్ధుడు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్సై రాజు గురువారం పేర్కొన్నారు. ఈ నెల 13న నర్సయ్య చిక్కడపల్లి గ్రామానికి టీవీఎస్‌ ఎక్సెల్‌ వాహనంపై వెళ్తుండగా మార్గమధ్యలో అదుపుతప్పి పడిపోయాడు. తీవ్రగాయాలు కావడంతో కుటుంబీకులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందాడు. మృతుడి కుమార్తె పాపవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

చెట్టును ఢీకొన్న కారు

- భార్యాభర్తలకు గాయాలు



మాచారెడ్డి: కారు అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో భార్యాభర్తలకు గాయాలైన ఘటన మండలంలోని ఘన్‌పూర్‌ శివారులో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్‌ గ్రామానికి చెందిన నరేందర్‌రెడ్డి, రేణుక దంపతులు పని నిమిత్తం కారులో కామారెడ్డికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో మండలంలోని ఘన్‌పూర్‌ శివారులోకి రాగానే కారు అదుపు తప్పడంతో చెట్టును ఢీకొన్నారు. ఈ ఘటనలో కారులో ఉన్న భార్యాభర్తలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

ఢిల్లీ పరేడ్‌లో 'వాడి' వాసి వైద్య సేవలు

- వైకల్యాన్ని జయించి ఉన్నతంగా ఎదిగిన తీరు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అవార్డులు అందుకున్న వైద్యుడు

ఆర్మూర్‌: వేల్పూర్‌ మండలం వాడి గ్రామానికి చెందిన డాక్టర్‌ గోలి శ్రీనివాస్‌ తనలోని వైకల్యాన్ని జయించి ఢిల్లీలోని ఎర్రకోట వద్ద గురువారం నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో వైద్య సేవలు అందించి తన ప్రత్యేకతను చాటుకున్నారు. గ్రామీణ ప్రాంతంలోని పేద కుటుంబానికి చెందిన గోలి శ్రీనివాస్‌ తన రెండో ఏటనే పోలియో బారిన పడటంతో కుడికాలు వైకల్యానికి గురైంది. అయినా మొక్కవోని ధైర్యంతో పదో తరగతి వరకు ఆర్మూర్‌ పట్టణంలోని సోషల్‌ వెల్ఫేర్‌ గురుకుల పాఠశాలలో, ఇంటర్‌ ఉప్పల్‌వాయి గురుకుల పాఠశాలలో చదివారు. కరీంనగర్‌లోని చల్మెడ ఆనంద్‌రావు మెడికల్‌ కళాశాలలో 2006లో మెడిసిన్‌ పూర్తి చేశారు. 2013–14లో ఢిల్లీలోని ఎయిమ్స్‌లో, 2015లో ఢిల్లీలో సెంట్రల్‌ గవర్నమెంట్‌ నిర్వహిస్తున్న ప్రఖ్యాత సఫ్దర్‌ గంజ్‌ ఆస్పత్రిలో తన సేవలు అందించారు. 2015 యూపీఎస్‌సీ సెలక్షన్స్‌లో సీఎంసీ బ్యాచ్‌కు ఎంపికయ్యాడు. శిక్షణ అనంతరం మున్సిపల్‌ కార్పొరేషన్‌ ఆఫ్‌ ఢిల్లీ(ఎంసీడీ) క్యాడర్‌ అలాట్‌ చేశారు. ఇంతకు ముందు కర్తవ్యపథ్‌(రాజ్‌పథ్‌)లో నిర్వహించిన భారత రిపబ్లిక్‌ డే 2023–24 ఉత్సవాల్లో భారత రాష్ట్రపతి, ప్రధాని పాల్గొన్న వేడుకల్లో భారత రక్షణ బలగాలు, పోలీసు సిబ్బంది, వివిధ రాష్ట్రాలకు చెందిన పరేడ్‌లో పాల్గొన్న వారికి వైద్య సేవలందించాడు. 2022–23లో ఎర్రకోటలో నిర్వహించిన భారత స్వాతంత్ర్య వేడుకల్లో కూడా స్వచ్ఛందంగా మెడికల్‌ టీంకు నాయకత్వం వహించడంతోపాటు ఇండియన్‌ ఫారెస్ట్‌ సర్వీస్‌ క్యాడర్‌ అభ్యర్థులకు మూడేళ్లుగా ఫిజికల్‌ టెస్టుల్లో కూడా స్వచ్ఛందంగా మెడికల్‌ సేవలందించాడు. కోవిడ్‌ సమయంలో కూడా తన వైకల్యాన్ని అధిగమించి నిర్విరామంగా అందించిన వైద్య సేవలందించారు. సఫాయి కార్మికులకు ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించడం లాంటి సేవలకు గాను కేంద్ర ప్రభుత్వంతో పాటు ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్‌, తమిళనాడు, మహారాష్ట్ర ప్రభుత్వాల నుంచి వివిధ అవార్డులు అందుకున్నారు.



ఎర్రకోట వద్ద వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్‌ శ్రీనివాస్‌

గర్వంగా ఉంది



గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి దేశ రాజధానిలో రాష్ట్రపతి, ప్రధాన మంత్రి లాంటి ముఖ్యులకు వైద్య సేవలు అందించే వైద్య బృందానికి నాయకత్వం వహించడం గర్వంగా ఉంది. ఇది నా ఒక్కడి విజయం కాదు. గ్రామీణ ప్రాంతానికి చెందిన నాకు సహాయ సహకారాలు అందించిన ప్రతీ ఒక్కరి విజయంగా భావిస్తున్నాను.

– డాక్టర్‌ గోలి శ్రీనివాస్‌, వాడి, వేల్పూర్‌ మండలం







క్యాంప్‌ కార్యాలయాల్లో జెండా ఎగురవేస్తున్న కలెక్టర్‌, సీపీ, బెటాలియన్‌లో కమాండెంట్‌

కార్యాలయాల్లో జెండావిష్కరణ

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా జడ్జి కార్యాలయంలో జడ్జి సునీత కుంచాల, కలెక్టర్‌, సీపీ క్యాంప్‌ కార్యాలయాల్లో కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమందు, సీపీ కల్మేశ్వర్‌, డిచ్‌పల్లిలోని ఏడో బెటాలియన్‌లో కమాండెంట్‌ రోహిణి ప్రియదర్శిని జెండాలను ఎగురవేశారు. -సాక్షి, నెట్‌వర్క్‌



జిల్లా కోర్టులో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జడ్జి సునీతకుంచాల

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

నిజాంసాగర్‌(జుక్కల్‌): మండలంలోని నర్సింగ్‌రావ్‌పల్లి సమీపంలోని జాతీయ రహదారి వంతెన కింద గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు బాన్సువాడ రూరల్‌ సీఐ సత్యనారాయణ గురువారం తెలిపారు. మృతుడి వయస్సు 50 ఏళ్ల లోపు ఉంటుందని, అతనిపై తెలుపు రంగు షర్టు, తెలుపు రంగు ధోతి ఉందన్నారు. ఆచూకి తెలిసిన వారు 8712686170, 8712686172 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.